## నిద్రపోయిన....
# ★ భార్యకు బహుమానం

'చంద్రకాంత'

●

సంధ్యాకాలం దాటింది. అతను విసురుగా నడుస్తున్నాడు. గాంధీనగరం దాటి వంతెన దాటి గవర్నరుపేటలో అడుగుపెట్టాడు.

అడుగడుక్కీ మనిషి మనిషినీ తప్పించుకుంటూ కదిలేసరికి అతని గమ్యస్థానం కూడ అడుగడుక్కీ వెనకబడుతోంది.

ఈ మనుషులు ఈ రొద ఈ తొందర...

ఎందుకో? ఎక్కడికో!

మనిషి మనుషులమధ్య తన వ్యక్తిత్వాన్ని కోల్పోయాడు.

బళ్లు, రిక్షాలు, కార్లు-మిల్లులు, పొగగొట్టాలు-రైలుబళ్ళు యింజను మేఘాలు-అంతా ఎడతెరపిలేని గుఱ్ఱాలపందెం!

యాతన-ఆవేదన-

తొందర-ఏదోమించిపోతోందే అనే ఉద్వేగం ఒకర్నొకరు త్రొక్కుకుపోయే ఉత్సాహం, ఈ బలాటం...

ఈ రొదలో, ఈ యంత్రగంభీరతలో, మనిషి తనన్నే మరచిపోయాడు!!

ఈ ప్రళయప్రవాహంలో పడి అతను ఈదుకుంటూ రొప్పుకుంటూ పోతున్నాడు. అన్నీ అడ్డంకులే!

ఒక్క క్షణంలో రెండు చినుకులు, మరు క్షణంలో ఆకాశంనుంచి పెద్ద జల్లు.

ఒక నిలిచిపోయిన యంత్రం, ఆ మనుష్యప్రవాహం. అందులో అతనొక మర.

దగ్గరే వున్న అరుగెక్కి నిరీక్షిస్తున్నాడు సమయంకోసం.

★

వర్షం రవంత తమాయించింది. అతను ఇల్లు చేరేసరికి రాత్రి పది దాటింది. తన మూడున్నర గంటల నిలువుజీతానికి అతను ఒక్కసారి ఈ లోకాన్నీ, అందులో వున్న సమాజాన్నీ తిట్టుకున్నాడు. కంటికి కనపడిన మ్యునిసిపల్ ఎలెక్షన్ల గోడమీద అక్షరాలు, ప్రక్కప్రక్కనే 'కాంగ్రెస్‌కే మీ వోటు,' 'ఎర్రపెట్టెలో వేయండి' అతని ఆశీస్సులు అందుకున్నాయి, యథాశక్తిని!

అతను వర్షానికి భయపడి అరుగెక్కలేదు. వర్షానికి తడవడం, ఎండకి ఎండడం అతనికి అలవాటే. ఈ యెండవానల ప్రగల్భాలకి అతని ఆరోగ్యం ఏనాడో చితికి చివికి చీకిపోయింది.

కాని, అతని బాధ కాస్తా చేతిలో మోస్తున్న సరుకుమీద వుంది.

ఒక్కరోజు క్రితం- తానూరు వదిలేసమయాన ఇంట రేగిన తుఫానుకు, తాను రాజీకి దిగి సంధిసూత్రాలు ప్రలాపింపబోయాడు. వెడుతూ అనబోతున్న మాటలు, అతని గృహిణి వినే పరిస్థితిలో లేదు. సరికదా వీధిగుమ్మందాకా సాగనంపడానికికూడా రాలేదు.

ఒక ఖద్దరు సిల్కు చీరా, జాకెటుగుడ్డా తళతళ మెరసే డజను గాజులు ఇన్ని సంపెంగ పువ్వులు...ఇవి భార్యకి బహూకరించి, తన మంచితనం, అమాయకత్వం, అన్నీ ఋజువుచేసుకో దలచుకున్నాడు. అన్నం పెట్టడానికి హడావుడిగా వంటింట్లోకి వెళ్ళబోయే ఆమెకి ఈ బహుమానం ఆధారుగా అందియ్యాలి. నిజానికి తనచేతితో వస్తువులు కొని ముద్దుగా ఇవ్వడం అతని గృహచరిత్రలో ఇంతవరకూ లేని విషయం.

వీధిగేటు తెరచేవుంది. తలుపూ తెరచేవుంది. సావిడి గదిలో లైటుమాత్రం వెలుగుతూవుంది.

రాము గుమ్మంలో కూర్చునివుంది. ఇల్లంతా నిశ్శబ్దం. బహుమాన సామగ్రి అతని చంకక్రింద గంతులు వేస్తోంది. సంపంగి పరిమళం రహస్యం బయటపెట్టేలాగుంది. అతన్ని చూసి రాము లేచి నిలబడింది.

"నిద్దరోతున్నారయ్యా"

"నిద్ర! అప్పుడే?"

"లేపుతానయ్యా"

లోపలకు వెళ్ళబోతున్న రాముని ఆగమ

* వందవ పేజీ

## వ్యాసకర్తలకు:

★

- రచనా వ్యాసంగానికి మీరు క్రొత్తవారే కావచ్చు. ఐనా లోకానికి తెలుపవలసిన కొన్ని క్రొత్త విషయాలు మీలో ఉరకలువేస్తూ వుండీ వుంటాయి. కాబట్టి ఎట్టి సంకోచమూ లేకుండా ఉత్సాహంతో ప్రయత్నించి మీ రచన మాకు పంపండి. ఏమాత్రం బాగున్నా సవరించి ప్రచురించడానికే సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాము.
- హాస్యప్రధానమైన వ్యాసాలకు ఆనందవాణి ప్రాధాన్య మిస్తుంది.
- తప్పనిసరి ఐతేకాని రచనలలో ఇంగ్లీషు పదాలు వాడకూడదు.
- వినోదము కలిగించే విజ్ఞానదాయకములగు చిన్న చిన్న రచనలయితే వేగంగా ప్రకటింప వీలవుతుంది.
- క్రొత్త సమస్యలకు సంబంధించి, ప్రసాదమైన హాస్యధోరణిలో ఉంటే తప్ప పద్య వ్యాసములు పంపవద్దు.
- ప్రతి వ్యాసంతోనూ మూడు కాన్ల పోస్టు బిళ్లలు పంపితేనే ప్రకటించే పక్షాన తెల్పడానికీ, నచ్చకపోతే వాపసు చేయడానికీ వీలవుతుంది. కార్డులు జతపర్చవద్దు.
- ప్రతివ్యాసంపయినా వ్యాసకర్త పూర్తి చిరునామా ఉండాలి.
- సరసమయిన ఊహలు కల్గి, వినోదింపజేసే వ్యంగ్యచిత్రాలనుకూడ ప్రచురణకు పంపవచ్చు.
- రచనలు, చిత్రాలు వ్యక్తుల పేర గాక— 'ఆనందవాణి' సంపాదకునకు 12 తంబుశెట్టి వీథి, పోస్టుబాక్సు నం. 1683 మదరాసు-1' అని వ్రాయాలి. లేకుంటే వ్యాసపరిశీలనము ఆలస్యము కావచ్చు.

—సంపాదకుడు

న్నాడు. "వాన-ఇంకా మబ్బుగా వుంది. వెళ్లిపో ...ఆలస్యమైపోయింది."

ఆమె కదిలింది.

'బహుమానాలు' లోపలకు తీసుకువెళ్ళేకంటే వీధివరండావేపు కిటికీలో వదిలపెడితే మంచిది. ఆమెకు తెలియకూడదు. రివ్వు రివ్వున గాలి వీస్తోంది. కిటికీ తలుపులన్నీ మూసివున్నాయి. లోన హాల్లో దీపాలుకూడా వెలిగించారు. పడకగదిలో అడుగుపెట్టేడు.

అతని ఉత్సాహం సగం చచ్చిపోయింది. ఈ సరికి ఆమెకు మెలకువ రావలసింది. కుర్చీలో కూలబడి మెల్లగా బూట్లు విప్పుకుంటున్నాడు ఆమెకేసే చూస్తున్నాడు.

'ఇంకా లేవకుండా వుండేదా! ఎప్పుడూ' అనుకున్నాడు. 'తాను నిద్రపోతున్నా, నే గుమ్మంలో అడుగుపెట్టేసరికి లేచేది: ఎవరో చెప్పినట్లు.'

ఆమె రెండోవేపుకు తిరిగింది.

'ఇంకేనా లేస్తే బావుండును. అప్పుడే నిద్రపోయింది. ఓ గంటయినాదు వచ్చేకూడా.'

ఆమెని లేపకుండా కూర్చుండిపోవడం అతనికి బాగా లేదు. రెండుసార్లు లేపబోయి మానుకున్నాడు. ఇటూ అటూ పచార్లుచేశాడు. అయినా ఎందుకో చల్లబడిపోయిన అతని హృదయానికి ఉత్సాహం రాలేదు. ఆమె లేవనే లేదు. నిద్రాభంగమయివుండవలసిందే. కాని, ఏమాత్రం చప్పుడు కాకుండా తనకు తెలియకుండానే జాగ్రత్త పడుతున్నాడు.

వంటింట్లోకి తొంగిచూశాడు. అంతా సవ్యంగానే వుంది. ఈ చలిగాలికి వంటకూడా తనవరకే చల్లారివుంటుంది. తన బహుమానసామగ్రి ఎదురుసన్నాహంకోసం ఇంకా వీధిలోనే యెదురుచూస్తోంది. తన ఉత్సాహం ఇంకా ఫలించలేదు. ఆమె సంతోషిస్తోంటే చూసే ఘడియ అంతకంతకు దూరమవుతోంది.

మళ్లీ పడకగది ప్రవేశించాడు. ఆమె నిద్రలోనే దుప్పటీ కప్పుకుంటోంది. ఆమె ముఖంకేసి తేరిపారచూశాడు: చాలా పాలిపోయివుంది. కాదు, పీక్కుపోయింది. తల పిచ్చిపిచ్చిగా వుంది. ఆమె బుగ్గలమీద చెయ్యి ఆనించి చూశాడు. కొంచెం మూలిగింది. తల రెండోవేపుకి తిప్పుకుంది. బుగ్గ వెచ్చగా వుంది!

ఆమెకి జ్వరం వచ్చింది. బాగా తలనొప్పి కూడా వుంటేనేగాని అలా పడివుండదు. చలి

కూడా వుండేమో. నిన్నటినుంచీ అయివుండాలి ఈ జ్వరం. ఈ వేళ లంఖణమయి వుంటుంది. మరి వంట యెలాగ చేసింది? ఆడాళ్లు బుద్ధిలేని ఆడాళ్లు! నెత్తిమీదికి రోగంవచ్చినా చాకిరీలూ హంగామాలూ మానరు. ఈ మాదిరిగా తన రోగాన్ని తానై కొనుక్కు తెచ్చుకోడం ఇది పాతికో సారి...

ఎంత పనయ్యింది... జ్వరం రానే వచ్చింది. అన్నం వండింది... ఏడవక పోయింది!

ఆకలివేపుకి అతని దృష్టి పోడంలేదు. ఇంత శ్రమపడి, అంత జ్వరంలోనూ ఆమె వంటచేస్తే తను తినకపోతే ఆమె ఉసూరుమని పోతుంది. ఈలోగా లేచిందా తనే అన్నం పెడతాననంటుంది.

రామి కూడా చెప్పింది కాదు. అసలు రామికి తెలియనిస్తేగా? ఈమె!

వంటగదికేసి అతని కాళ్లు తీసుకుపోయాయి. బయట చలిగాలి. అయినా లోపల ఉక్కగానే వుంది. ఏమో-అతని చేతివేళ్ళు వణుకుతున్నాయి. తలుపులన్నీ తెరచివేశాడు. పీట వేసుకున్నాడు. అక్కడే హాందికగా వున్నవన్నీ సవరించేడు. అన్నం వడ్డించుకున్నాడు. తను ఒంటరిగా అన్నం తినవలసివస్తోంది. నోట్లో ముద్ద పెట్టబోతున్నాడు.

ఏదో యెలుగు—

అది మూలుగు!

ఒక్క పరుగులో గదిలోకి వెళ్లేడు. ఆమె మూలిగింది. కాని, నిద్రలోనే వుంది. బాధగా వుందేమో.

ఈ వంటరి బాధ అతను పడలేకపోతున్నాడు. మంచందగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. ఒక్కసారి లేపి అన్ని సంగతులూ కనుక్కుంటేనే మంచిది. నిస్పృహా, నీరసం అన్నీ... వళ్లు తెలియకుండా పడివుంది. డాక్టర్ని తీసుకొస్తే? వక్కరినీ వదలియెలా? అతని తల వేడెక్కుతోంది. ఆమె శరీరంమీదికి చేతిని పోనిచ్చేడు. కళ పెళ కాగిపోతోంది.

ఆమెకి తెలివి వచ్చింది. కాదు-ఒక్క పిచ్చి కేక వేసింది. గజగజ వణకిపోసాగింది.

"నేనే... నేనేరా... నేనే" మెల్లగా ఆమెని సముదాయించ సాగేడు. ఆమె వెర్రివాలకం చూసి అతను బేజారెత్తిపోయాడు. ఆమె బెదరింది. ప్రక్కను కూర్చుని మెల్లగా నిద్రపుచ్చాడు.

ఆమెకు మెలకువ వచ్చింది.

"నన్ను లేపలేదేం?" ఒక్కటే సూటిప్రశ్న.

"హాయిగా నిద్రపోతున్నావ్"

"ఎప్పుడూ అంతే మీరు"

"ఇప్పుడెలా వుంది?"

"ఏంవిటి?"

"నీరు కాస్త..."

"ఏవిటి?"

"జ్వరం ఎప్పట్నుంచి? నీరసం?"

ఆమె నవ్వుతో వీధిలో వర్షం ఆరంభమయ్యింది.

"తలనొప్పి? డాక్టర్ని తీసుకురానా? చలి వుందా? విరోచనమయ్యిందా? ఏమైనా యెంగిలి పడ్డావా?"

"పిచ్చెక్కిందా యేమండీ? దుంగలాగున్నా దెయ్యంలా తిరుగుతున్నా— ఏదో నిద్రపట్టింది."

"వొళ్ళు?" అతను ఆమె నాడి చూశాడు. తలచేతులుపొత్తికడుపు అన్నీ కళ పెళ కాగడంలేదు!

"రండి ఇద్దరు మెతుకులు తిందాం"

అతని చెయ్యిపట్టుకుని వంటింట్లోకి నడిపిస్తోంది. అతని మనస్సు వీధి వరండాలోని బహుమానాల పొట్లంకేసి వెళుతోంది.

"అరె" భార్య తెల్లబోయింది. ఇద్దరూ నిలువునా నిలపడిపోయారు.

భోజనం అంతా అయిపోయింది. పెరట్లోంచి కుక్క వచ్చి ఆరగించింది; గిన్నెలు చిందరవందరగా వున్నాయి. వీరిని చూసి కుక్క వానలోకి వురికింది.

మాట్లాడకుండా ఆమె కుంపటి రాజెయ్య సాగింది.

అతని మొహం తిరిగినట్లయింది. వీధిగదికేసి వెళుతున్నాడు. భార్య ప్రశ్న అతనికి వినపడలేదు. ఆమెకూడా లేచి వెళ్ళింది. అతను వెతుకుతున్నాడు. కిటికీలూ, తలుపులూ, కుర్చీలూ, డ్రాయరు చొరుగులూ, వరండా అంతా—

"ఏమిటండి?"

"నేను ఇక్కడో పేపరుకాయితంపొట్లం..."

ఆ వరండా లైటువేసింది. వరండాలో అటువంటి వస్తువేదీ లేదు. ఆఖరి చీడీ మునిగిపోయే వరకు వాననీరు చేరింది. అతను ఒక్క వురకని వానలోకి వెళ్లేడు. నీళ్ళలోంచి తీశాడు. ఓ తడిసిపోయిన పొట్లం—వరండామీదికి వచ్చేడు. అతని బట్టలన్నీ తడిసి నీళ్ళు కారుతున్నాయి. అతని కళ్ళమ్మట కూడ...